# నర సింహుడు

ఇప్పటి భారతదేశ నిర్మాత కథ

**వినయ్ సీతాపతి**

ఎమెస్కో

# ముందుమాట

**ఈ** పుస్తక రచయిత శ్రీ వినయ్ సీతాపతి పుస్తక రచనా సమయంలో తెలుగులో ఈ పుస్తకాన్ని ప్రచురించమని అడగడానికి నన్ను కలిసారు. పుస్తక రచనా సమయంలో అతను  వందలమంది ప్రముఖుల్ని, వేలాది పి.వి. వ్యక్తిగత పత్రాలను పరిశీలించిన విషయం నాకు చెప్పారు. ఆశ్చర్యం వేసింది ఏ తెలుగువాడూ చేయని పనిని ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేస్తున్న ఓ యువకుడు చేస్తున్నందుకు. అతన్ని మనసారా అభినందించాను. నా తరఫున, మనందరి తరఫున.

ఎందుకంటే ... పీవీ మనవాడు, మన తెలుగువాడు.

ఇక కథనానికి వస్తే ...

ఇది చరిత్ర, మానవ సమాజ నిర్మాణంలోని వైచిత్రికి అద్దం పట్టిన కథ.

ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనికిరానివాడని భావించబడి, తన జీవిత చరమాంకంలో కనీసం ఒక పార్లమెంట్ అభ్యర్థిత్వాన్ని కూడా పార్టీనుంచి సంపాదించుకోలేని ఓ వ్యక్తిని పరిస్థితులు ఏరకంగా ప్రధానమంత్రిగా మార్చాయి?

నెహ్రూ కుటుంబమే కాంగ్రెస్ పార్టీగా భావించే నాయకులున్న దేశాన్ని ఆ కుటుంబానికి బయటివ్యక్తి ఐదు సంవత్సరాలు నిర్విఘ్నంగా పరిపాలించడమేమిటి?

కూలిపోతున్న ఆర్థికవ్యవస్థను మారుతున్న ప్రపంచానికి దీటుగా నిలబెట్టిన ఘనత ఈ వ్యక్తికి ఎక్కడినుంచి వచ్చింది?

ఈ దేశపు మట్టికి తనకు కావలసివచ్చినప్పుడు తనకు అవసరమైన నాయకత్వాన్ని నిర్మించుకునే శక్తి వుందనీ, చరిత్ర తన కథ తానే రాసుకుంటుందనీ నిరూపించిన కథనం.

పి.వి. నరసింహారావు అని పిలవబడే వంగర కరణంగారు భారత ప్రధానమంత్రిగా మారి ఒక నెహ్రూతో సమానంగా నిలబడగల నాయకుడిగా చరిత్రలో నిలిచిన కథ.

ఇప్పటి మన దేశ నిర్మాత కథ.

***ఎమెస్కో విజయకుమార్***

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | సగం కాలిన శవం | 7 |
| 2. | ఆంధ్ర సోషలిస్టు, 1921–71 | 22 |
| 3. | కీలుబొమ్మ ముఖ్యమంత్రి, 1971–73 | 49 |
| 4. | అజ్ఞాతంలో, 1973–74 | 63 |
| 5. | ఢిల్లీ దర్బార్, 1975–1991 | 78 |
| 6. | సన్యాసి నుంచి సార్వభౌముడు | 122 |
| 7. | ఆర్థిక పరిస్థితి పరిరక్షణ, 1991–92 | 148 |
| 8. | ఆర్థిక వ్యవస్థ పెరుగుదల, 1992–1996 | 186 |
| 9. | శ్రేయోరాజ్యం? | 220 |
| 10. | పార్టీ, పార్లమెంట్ మనుగడ | 235 |
| 11. | సోనియా గాంధీతో వ్యవహారం | 269 |
| 12. | బాబ్రీ మసీదు పతనం | 284 |
| 13. | అటు తూర్పు, ఇటు పడమర | 318 |
| 14. | అణ్వాయుధీకరణ | 343 |
| 15. | సింహం, నక్క, ఎలుక | 362 |
| | *Acknowledgements* | 387 |
| | *వివరణలు* | 393 |

*రాజు అనేవాడు అవసరాన్ని బట్టి నక్కలా, సింహంలా వ్యవహరించాల్సి వుంటుంది. ఎందుకంటే కేవలం నక్కలా వుంటే తోడేళ్ల నుంచి కాపాడుకోలేడు. కేవలం మృగరాజులా వ్యవహరిస్తే ప్రత్యర్థులు తనను బంధించడానికి తవ్వి పెట్టిన కందకాల్ని కనుక్కోలేడు. అందుకే తోడేళ్లను భయపెట్టాల్సి వచ్చినప్పుడు సింహంలా గర్జించాలి, గోతులు తవ్వే వాళ్లని కనిపెట్టడానికి నక్కజిత్తులు వేయాలి.*

– నికోలో మాకియవెల్లి (*'ది ప్రిన్స్'*)
ఇటాలియన్ రాజనీతివేత్త, 16వ శతాబ్దం

*మృత్యువును జయించాలనుకొని రాక్షసరాజు హిరణ్యకశిపుడు తపస్సు చేశాడు, వరం పొందాడు. ఆ వరం ప్రకారం అతనికి ఆకాశంలోగాని భూమ్మీదగానీ, పగలుగాని రాత్రిగాని, ఇంట్లోగాని బయటగానీ, మనిషి చేతిలోగాని జంతువుచేతిలోగాని చావులేదు. "మృత్యువుని భలే మోసం చేయగలిగాను" అనుకొని, హిరణ్యకశిపుడు తననితాను దేవుడిగా ప్రకటించుకున్నాడు. ముల్లోకాలనీ భయపెట్టసాగాడు.*

*కానీ అతని కొడుకు ప్రహ్లాదుడు మాత్రం సర్వ సృష్టి, స్థితి, లయకారుడిగా శ్రీమహావిష్ణువునే ఆరాధించసాగాడు. ఆగ్రహోదగ్రుడైన హిరణ్యకశిపుడు కొడుకుమీద విరుచుకుపడ్డాడు. "ఏడిరా, నీ విష్ణువు? ఎక్కడపడితే అక్కడ వున్నాడంటున్నావ్? ఈ స్తంభంలో వున్నాడా?" అంటూ నిప్పులు కక్కాడు. ప్రహ్లాదుడు "వున్నాడు" అన్నాడు. అంతే! హిరణ్యకశిపుడు తన గదతో అక్కడున్న స్తంభాన్ని తునాతునకలయ్యేలా బాదాడు.*

*ఆ స్తంభంలోంచి విష్ణువు అవతారమైన నరసింహుడు ఆవిర్భవించాడు. నరసింహుడు అంటే సగం నరుడు, సగం సింహం. సింహంలా గర్జించాడు. మనిషిలా నడిచాడు. పగలుకూ, రాత్రికీ మధ్య సూర్యుడు అస్తమించే సమయంలో, ఇంట్లోనూ బయటా కాకుండా, ఆకాశంలోనూ, భూమ్మీద కాకుండా సింహద్వారపు గుమ్మంమీదకి హిరణ్యకశిపుణ్ణి ఈడ్చుకువెళ్లి, తన ఒళ్లో పడేసి, సింహపు పంజాతో నిలువునా చీల్చి చంపేశాడు. ఆ వైరుధ్యం వుంది కాబట్టే 'నర–సింహుడు' రాక్షసుణ్ణి చీల్చి చెండాడాడు.*

– నరసింహావతారం కథ (*భాగవత పురాణం*) [1]

# 1

# సగం కాలిన శవం

**2004** డిశంబరు 23

మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో ఢిల్లీలోని మోతీలాల్ రోడ్డులో తొమ్మిదో నెంబరు ఇంటిముందు ఎయిమ్స్ అంబులెన్స్ వచ్చి ఆగింది. అందులోంచి తెల్లటి ధోతి, సిల్కు లాల్చీ[2] ధరించి వున్న ఒక మృతదేహాన్నిదించి, ఇంట్లోకి చేర్చారు.

1991 నుంచి 1996 వరకూ భారతదేశానికి ప్రధానమంత్రిగా వుంటూ, ఈ దేశపు కీర్తి బావుటాని ప్రపంచ పటంలో సమున్నత స్థానాలకు తీసుకువెళ్లిన రాజనీతివేత్త పాములపర్తి వేంకట నరసింహారావుది ఆ పార్థివశరీరం. 23 ఉదయం 11 గంటల ప్రాంతంలో ఎయిమ్స్‌లో తుదిశ్వాస తీసుకుంటే, ఆ శరీరానికి అందమైన వస్త్రాలు కట్టి, మధ్యాహ్నం 2.30 ప్రాంతంలో ఆయన నివాసగృహానికి చేర్చారు.

ఒక్కసారిగా ఆ ప్రాంగణం ఘొల్లుమంది. ఏడ్పులతో నిండిపోయింది. అలా తండ్రి దేహాన్ని చూస్తూనే ఆయన పెద్దకొడుకు రంగారావు వెక్కి వెక్కి ఏడుస్తూ కూలబడిపోయారు. పి.వి.గారి కొడుకులు, కూతుళ్లు (మొత్తం 8 మంది) మనుమలు, మేనల్లుళ్లు, మేనకోడళ్లు, అతి దగ్గర బంధువులు కూడా అక్కడ శోకసముద్రంలో మునిగిపోయి ఉన్నారు.

బంధువులు కానివాళ్లలో– ముప్ఫైఏళ్లకు పైగా పి.వి.కి సన్నిహితుడైన – చంద్రస్వామి ముందుగా అక్కడకు చేరుకున్నాడు.[3] రాజకీయ నాయకుల రాక మొదలైంది. ఇక (శవ) రాజకీయం కూడా అప్పుడే మొదలైంది. హోం మంత్రి

శివరాజ్‌పాటిల్ పి.వి. చిన్నకొడుకు ప్రభాకర్ దగ్గరికి వచ్చారు. "నాన్నగారి అంత్యక్రియలు హైదరాబాద్‌లో జరగాలి ప్రభాకర్" అన్నారు పాటిల్.

నిశ్చేష్టుడయ్యాడు ప్రభాకర్.

"అలా ఎలా కుదురుతుంది? నాన్నగారు ఈ దేశానికి ప్రధానమంత్రిగా చేసినవారు. అంత్యక్రియలు ఇక్కడే జరగడం న్యాయం కదా!" ఏడుపు దిగమింగుకుంటూ ప్రభాకర్ అన్నారు. ప్రభాకర్ ఒక్కరేకాదు, పి.వి.గారి కుటుంబసభ్యులంతా అదే కోరుతున్నాం అన్నారు.

వాళ్లలా కోరటానికి బలమైన కారణం – కేవలం ఆయన ప్రధానమంత్రిగా పనిచేస్తుండడమే కాదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పి.వి. ముఖ్యమంత్రిగా పనిచేసి మూడు దశాబ్దాలు దాటింది. ఆ తరువాత ఆయన రాజకీయ జీవితమంతా ఢిల్లీలోనే గడిచింది. జాతీయ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిగా, మానవ వనరుల శాఖామంత్రిగా, చివరికి ప్రధానమంత్రిగా... ఇదంతా ఢిల్లీలోనే గడిచింది. ఢిల్లీతో ఆయన అనుబంధం విడదీయరానిదయిపోయింది. అందుకే కుటుంబమంతా ఆయన అంత్యక్రియలు ఢిల్లీలోనే జరగాలని కోరుకుంది.

శివరాజ్‌పాటిల్ తాపీగా స్పందించారు. "ఇక్కడికి ఎవ్వరూ రారయ్యా."[4]

కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలైన సోనియాగాంధీకి విశ్వాసపాత్రుల్లో ఒకరైన కాశ్మీరీ నాయకుడు గులామ్ నబీ ఆజాద్ వచ్చారు. అతను కూడా పాటిల్ చెప్పిన విషయం మీదే పి.వి. కుటుంబానికి 'హితవు' చెప్పడం ప్రారంభించారు. ఒక గంట తరువాత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా. వై.యస్. రాజశేఖర్ రెడ్డి నుంచి ప్రభాకర్‌కి ఫోన్ కాల్ వచ్చింది.

"ప్రభాకర్, జరిగినదానికి చాలా బాధగా ఉంది.... సరే, నేనిప్పుడు అనంతపురంలో ఉన్నాను, ఈ సాయంత్రానికి ఢిల్లీ చేరుకుంటాను. నాన్నగారికి మనం హైదరాబాద్‌లో చరిత్రాత్మకమైన రీతిలో అంత్యక్రియలు జరిపిద్దాం. నా మాటలు నమ్మండి."

సూర్యాస్తమయం అవుతుండగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ వచ్చారు. ఆమె వెనకాలే ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, కేంద్రమంత్రి ప్రణబ్ ముఖర్జీ. వాళ్లు నేరుగా పి.వి. మృతదేహం ఉంచిన గదిని ఆనుకుని ఉన్న వరండాలోకి వెళ్లారు. అక్కడ పూలతో అలంకరించబడిన పి.వి. దేహాన్ని చూశారు.

ప్రధానమంత్రి ప్రభాకర్‌ని పక్కకు పిలిచి అడిగారు, "అంత్యక్రియల విషయంలో మీరేం చేద్దామనుకుంటున్నారు?... మా వాళ్లంతా హైదరాబాదులో జరగాలనుకుంటున్నారు...."

"అదేంటి సార్! ఢిల్లీ నాన్నగారి కర్మభూమి కదా! కొంచెం మీరే మీ మంత్రివర్గానికి చెప్పి ఒప్పించవచ్చు కదా!" అంతటి బాధలోనూ నిర్మొహమాటంగా చెప్పారు ప్రభాకర్.

అంతలో ప్రధానమంత్రి సలహాదారు సంజయ్ బారు వచ్చారు. అతను ఆ వరండాలోకి అడుగుపెట్టగానే సోనియా రాజకీయ సలహాదారు అహ్మద్ పటేల్ బారు భుజం తట్టారు. "నీకు ఈ కుటుంబమంతా బాగా తెలిసినవాళ్లేనా?" బారు అవునన్నట్టు తలూపాడు.

"మృతదేహాన్ని హైదరాబాదు తరలించే విషయంలో ఆ కుటుంబాన్ని కొంచెం ఒప్పించగలవా?"

బారు సాలోచనగా తల పంకిస్తూ, వరండా చివర పి.వి. దేహం ఉన్నగదిలోకి వెళ్లారు. ఒకపక్కనుంచి వినిపిస్తున్న ఏడుపు విని అటుతిరిగి చూశారు. అక్కడ సీనియర్ జర్నలిస్టు, పి.వి.గారికి ఆప్తురాలైన కల్యాణి శంకర్ దుఃఖిస్తూ కనబడింది.[5]

డా. రాజశేఖర రెడ్డి ఢిల్లీ చేరుకుని, నేరుగా పి.వి. నివాసానికి వచ్చేశారు. పి.వి. కి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుటుంబసభ్యుల్ని పరామర్శించారు. "నన్ను విశ్వసించండి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మనది. నాన్నగారిని హైదరాబాదుకు తీసుకువెళ్దాం. అక్కడ అంతిమయాత్ర ఘనంగా చేద్దాం...." అని చెప్పుకుంటూ వెళ్లారు.

పి.వి. కుమార్తె వాణిదేవి మాటల్లో చెప్పాలంటే, "ఆ రోజు మా కుటుంబాన్ని ఒప్పించటంలో వైయస్ కీలకపాత్ర పోషించారు."[6]

పి.వి.కి ఒక స్మృతి చిహ్నం ఢిల్లీలోనే ఏర్పాటుకావాలని ఆయన కుటుంబ సభ్యులంతా కోరుకున్నారు. ఈ మేరకు ఒక హామీ ఇవ్వాలని కూడా వాళ్లు పట్టుబట్టారు. అక్కడున్న కాంగ్రెస్ నాయకులంతా "అవును, అవును" అన్నట్లు తలలూపారు. అయినా ఆ కుటుంబం నమ్మలేకపోయింది. పి.వి.ని ఆయన చివరిరోజుల్లో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఎంత చిన్నచూపు చూసిందో వాళ్ల గుండెల్లో ఇంకా మెదలుతూనే ఉంది. అందుకే పట్టుబట్టారు.